## ఇసుక నూతన మార్గదర్శకాలు

తాంసి(భీంపూర్), మే 5 : ఇసుక అవసరం ఉన్నవారు తహసీల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని భీంపూర్ తహసీల్దార్ నలందప్రియ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఆర్ఐ, డీటీలు పరిశీలించి అనుమతి ఇస్తారని వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీగా జరిమానాలు ఉంటాయని తహసీల్దార్ స్పష్టం చేశారు.

## నేటి నుంచి జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

బోథ్, మే 5 : బోథ్ మార్కెట్ యార్డులో చేపడుతున్న జొన్నల కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో జొన్న నిల్వ పేరుకపోయినందున మంగళ, బుధవారాల్లో కొనుగోళ్లు ఉండవన్నారు. ఈనెల 8 నుంచి కొనుగోళ్లు తిరిగి ప్రారంభమవుతాయని, రైతులు సహకరించాలని కోరారు.

## 9 నుంచి జొన్న కొనుగోళ్లు

తాంసి(భీంపూర్), మే 5 : తాంసి పీఏసీఎస్ మార్కెట్ యార్డులో తాంసి, భీంపూర్ మండలాల రైతుల జొన్న పంటను ఈనెల 9 నుంచి కొనుగోలు చేస్తామని కేంద్రం ఇన్‌చార్జి కేశవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తడిసిన పంట కొనడం జరగదన్నారు. ఇతర మండలాల రైతులు జొన్నను అమ్మకాలకు తేవద్దని సూచించారు.

## అన్నదానం ప్రారంభం

బోథ్, మే 5 : బోథ్ మార్కెట్ యార్డులో జొన్నలు అమ్మకానికి తెస్తున్న రైతులకు సోమవారం నుంచి ఉచిత అన్నదానం చేపడుతున్నట్లు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గంగారెడ్డి తెలిపారు. ఉచిత అన్నదానాన్ని మాజీ ఎంపీ సోయంబాపురావు ప్రారంభించారు. నిత్యం మధ్యాహ్న సమయంలో రైతులకు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రెడ్డి, నాయకులు జీ రాజు యాదవ్, పసుల చంటి, గాజుల పోతన్న, షేక్ అహ్మద్, గడ్డల నారాయణ, అబ్రార్, అమృత్‌రావ్ పాటి పాల్గొన్నారు.

## కార్ల్ మార్క్స్‌కు నివాళి

ఎదులాపురం, మే 5 : కార్ల్ మార్క్స్ సిద్ధాంతంతో కార్మికులతో పాటు ప్రజల హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనల మల్లేశ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, నాయకులు లంక రాఘువులు, బండిదత్త్రాతి, కిరణ్, ఆశన్న, మంజుల, సచిన్, సురేందర్, స్వామి, ఆరిఫా, కోట్నాక్ సక్కు పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

ఎదులాపురం, మే 5 : ఆదిలాబాద్ పట్టణంలోని లారీ అసోసియేషన్ ఏరియా వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం దాడి చేసి ఐదుగురు నిందితులను పట్టుకున్నామని టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.8, 800 నగదు, నాలుగు మొబైల్ ఫోన్ లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

## వివాహిత అదృశ్యం

ఎదులాపురం, మే 5 : ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ చెందిన వివాహిత(30) అదృశ్యం అయినట్లు వన్‌టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. గత నెల 26న ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. భర్త టేకం శంకర్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## ఎస్ఐకి సన్మానం

తాంసి(భీంపూర్), మే 5 : భీంపూర్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బీ వీర్‌సింగ్‌ను సోమవారం పీఎస్‌లో బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లింబాజీ, సంతోష్, రవీందర్, అశోక్, రాము, ప్రవీణ్, మనోజ్ పాల్గొన్నారు.

## వరి పంట దగ్ధం

నర్సాపూర్ (జీ), మే 5 : రాంపూర్ గ్రామానికి చెందిన మంత్రి ఆనంద్ అనే రైతుకు చెందిన వరి పంట సోమవారం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, నసీరాబాద్ గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో వరి పంట సాగు చేస్తున్నానని, ప్రమాదవశాత్తు పంట పొలంలోని 11 కేవీ వైర్ తెగిపడి నిప్పురాజుకోవడంతో 5 గుంటల వరి పంట దగ్ధమైందని తెలిపాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

## జూన్ 14న జాతీయ లోక్ అదాలత్

నిర్మల్ అర్బన్, మే 5: జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా పోలీస్ అధికారులతో ఆన్‌లైన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వివాదాలు, రాజీపడే క్రిమినల్ కేసులు, పెండింగ్‌లో ఉన్న టూ వీలర్, ఫోర్ వీలర్ కేసులు, చలానా కేసులు, పెట్టి కేసులు మొదలైన వాటికి సంబంధించిన కేసులను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కక్షిదారులందరికీ సమాచారం అందించి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## ఉచిత విద్య అందించేందుకు టాలెంట్ టెస్ట్

ఎదులాపురం, మే 5: పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు సోమవారం టాలెంట్ టెస్టు నిర్వహించారు. డైట్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టీఎస్ యూటీఎఫ్ సంఘ సభ్యులతో కలిసి ప్రశ్నా పత్రాలు విడుదల చేశారు. పేద వారికి నాణ్యమైన విద్యను అందించేలా పీపీటీ ఆధ్వర్యంలో సౌజన్యంతో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని డీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిష్టన్న, ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మణరావు, కోశాధికారి శ్రీనివాస్, కార్యదర్శులు స్వామి శివన్న, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## పొచ్చమ్మ ఆలయంలో చోరీకి విఫలయత్నం

ఎదులాపురం, మే 5: పట్టణంలోని అశోక్ రోడ్‌లో గల పొచ్చమ్మ ఆలయంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఆదివారం రాత్రి దొంగలు గుడి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. వస్తువులను చిందరవందరగా పడేశారు. పూజకోసం వినియోగించే వీణను పగలగొట్టారు. సోమవారం తెల్లవారు జామున ఆలయానికి వచ్చిన భక్తుడు పూజారి పోలీసులకి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. పోలీసులు చేరుకొని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

నార్నూర్, మే 5: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గొండ్వాన పంచాయతీ రాయిసెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గుపటేల్ ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాను కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. నార్నూర్, గాదిగూడ మండలంలోని సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఇక్కడ ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తొడసం నాగోరావ్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవు, మాజీ సర్పంచ్ మడావి రూప్‌దేవు, ఉపాధ్యాయుడు మెస్రం శేఖర్‌బాబు ఉన్నారు.

## భర్త వేధింపులతో ఆత్మహత్య

ఉట్నూర్, మే 5 : అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తట్టుకోలేక ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, మండలంలోని గంగాపూర్‌కు చెందిన పెరుగు సంజీవ్ తన మూడో కూతురు జాడి సుప్రియ(24)ను పట్టణంలోని పాత ఉట్నూర్‌కు చెందిన జాడి రాధకృష్ణకు ఐదు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిపించారు. అయితే అప్పటి నుంచి కట్నం కోసం వేధించడంతో లక్ష రూపాయలు ఇచ్చాడు. ఇటీవల మళ్లీ 20 వేలు కావాలని మానసికంగా, శారీరకంగా వేధించడంతో ఉరి వేసుకుందని తెలిపారు. సుప్రియకు నాలుగు సంవత్సరాల కూతురు ఉన్నది. సుప్రియ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉట్నూర్ సీఐ మొగిళి తెలిపారు.

## ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

గుడిహత్నూర్, మే 5: ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని సీతాగోంది గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ సోమవారం చికిత్స పొందుతూ జిల్లా కేంద్రంలోని రిమ్స్ దవాఖానలో మృతి చెందింది. ఆదివారం మండలంలోని మన్నూర్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న ఆటో సీతాగొంది గ్రామ సమీపంలో ప్రైవేటు బస్సును వెనుక నుంచి ఢీకొన్నది. అందులో ప్రయాణిస్తున్న శాంతాపూర్ గ్రామానికి చెందిన పోసానికి (70) గాయాలుగా కాగా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస వదిలింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

## హోటల్‌లో అగ్నిప్రమాదం

తాంసి, మే 5 : మండలంలోని కప్పర్ల గ్రామంలోని హోటల్‌లో సోమవారం గ్యాస్ లీకై మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం సంభవించింది. గంగమ్మ తన హోటల్‌లో గ్యాస్ పొయ్యి మీద బజ్జీలు వేస్తుండగా గ్యాస్ లీకై మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఒక టీవీ ధ్వంసం కాగా మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పంచ నామా నిర్వహించారు. ఇటువంటి ఘటనలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఎస్ఎఫ్‌వో జైత్ రామ్, డీవోపీ మోహన్, ఫైర్ సిబ్బంది పృథ్వీరాజ్, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ కోడాల మహేందర్, గ్రామస్తులున్నారు.

## జొన్నలు కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి

నార్నూర్, మే 5 : రైతులు జొన్న పంటను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ముకాడే ఉత్తమ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉపమార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి జొన్న కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కటీ రికార్డు నమోదు చేయాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ సూచించారు. ఇక్కడ సహకార సంఘం సీఈవో ఆడే గణేశ్, కార్యదర్శి పండరి ఉన్నారు.

## జస్టిస్ ప్రియదర్శిని మరణం తీరని లోటు

ఎదులాపురం, మే 5 : హైకోర్టు జస్టిస్ ప్రియదర్శిని అకాల మరణం తీరనిలోటని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావ్ అన్నారు. సోమవారం ప్రియదర్శిని సంతాప సభను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావ్ మాట్లాడుతూ ప్రియదర్శిని హైకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన కూడా అందరితో కలిసి ఉండేవారన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, కుమార్ వివేక్, లక్ష్మీకుమారి, రాజ్యలక్ష్మి, హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేశ్, ప్రధాన కార్యదర్శి డీఎస్పీ శర్మ, ఉపాధ్యక్షుడు చందుసింగ్, లైబ్రరీ సెక్రటరీ నిఖిలేశ్, మహిళా ప్రతినిధి మంజులత పాల్గొన్నారు.

ఉట్నూర్, మే 5 : అనారోగ్యంతో మృతి చెందిన హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని, అలాగే గుండె పోటుతో మృతి చెందిన నారాయణకు ఉట్నూర్ బార్ అసోసియేషన్ సభ్యులు సోవారం స్థానిక కోర్టు ఆవరణలో నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, న్యాయవాదులు జమీర్‌ఖాన్, జైవంత్‌రావు, దీరజ్ గుప్తా, పెందూర్ ప్రభాకర్, గిరి, శ్రీనివాస్, వసంత్‌రావు, అశోక్, రాజు, వినోద్, లక్ష్మీ నారాయణ, అజహర్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, మే 5: ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదు దారులతో గౌరవంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించినప్పుడే పోలీసుల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు. సుదూర ప్రాంతాల ఫిర్యాదుదారులు జిల్లా పోలీసు కార్యాలయానికి రాని వారు మెస్సేజ్ యువర్ ఎస్పీ ద్వారా సంప్రదించాలన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

## గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, మే 5 : గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తామని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. సోమవారం స్థానిక పీవో క్యాంప్ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కామాయిపేట్ గ్రామానికి చెందిన భీంరావు తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బోథ్ మండలం సాంఘ్వీ గ్రామానికి చెందిన రాజేశ్వరి తనకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లా జైనూర్ మండలం పానపటార్ గ్రామానికి చెందిన ఆత్రం లత తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు ప్రభుత్వ పథకాలు మంజూరు చేయించాలని వినతులు అందించగా, వాటిని పరిశీలించారు. ఈ దర్బార్‌లో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్ కుమార్, మేనేజర్ శ్యామల, డీపీవో, జేడీఎం, అధికారులున్నారు.

## కార్యకర్త కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబానికి పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

బేల, మే 5 : కిరాణా షాప్‌లో పెట్రోల్ పోస్తుండగా ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై ఒళ్లంతా కాలిన గాయాలతో బాధపడుతున్న మండలంలోని బాది గ్రామస్తుడు బీఆర్ఎస్ కార్యకర్త బొల్లి దయాకర్‌ను సోమవారం మాజీ మంత్రి జోగు రామన్న వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు అధైర్య పడొద్దని ధైర్యాన్నిచ్చారు. వైద్యులకు ఫోన్ చేసి పరిస్థితిపై ఆరాతీసి తనకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రమోద్ రెడ్డి, మస్కే తేజరావ్, బిక్కి ఆశన్న, పోచ్చరెడ్డి ఉన్నారు.

# భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మే,5: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వ భూ భారతి చట్టాన్ని రూపొందించిందన్నారు. అనంతరం రైతుల సమస్యలను కలెక్టర్ స్వయంగా విని పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి సందీప్‌కుమార్, తహసీల్దార్ రాజు, రైతులు పాల్గొన్నారు.

కుంటాల, మే, 5 : భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం ఆమె కుంటాల మండలంలోని ఓలా, రాయ్‌పాడ్, మెదన్‌పూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతుండగా ఓలాలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, తహసీల్దార్లు కమల్ సింగ్, ఎజాజ్ ఖాన్, సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.



కుంటాల : ఓలాలో భూ భారతి దరఖాస్తుల ప్రక్రియను అడిగి తెలుసుకుంటున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

### లైట్లు పెట్టించండి

మా తండా అడవి మధ్యలో ఉండడంతో అటవీ జంతువులు వచ్చి పశువులపై దాడి చేస్తున్నాయని, వీధి లైట్లు పెట్టించాలని సోమవారం ఓలా రెవెన్యూ సదస్సును తనిఖీ చేయడానికి వచ్చిన నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌ను అంబకంటి గ్రామపంచాయతీ పరిధిలోని రాయిపాడ్ తండా వాసులు కోరారు. ఆరబోసుకున్న ధాన్యాన్ని రాత్రుల్లో అడవి పందులు వచ్చి మేస్తున్నాయని, అలాగే వీధుల్లో లైట్లు లేకపోవడంతో అంధకారంతో భయానక వాతావరణం నెలకొందని సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే గ్రామ కంఠంలోని కొంత భూమి ఆక్రమణకు గురవుతోందని ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### సీసీరోడ్డు ఇరుకుగా మారింది

కుంటాల మండలం దౌనెల్లిలోని ఓ వీధిలో ఓ వ్యక్తి నిర్మిస్తున్న ఇంటి గోడ ఫిల్లర్ గ్రామ పంచాయతీ సీసీ రోడ్డుపైకి రావడంతో దారి ఇరుకుగా మారిందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌కు అదే గ్రామానికి చెందిన విశాల్ విన్నవించాడు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని సమస్యను పరిష్కరించాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి విన్నవించాడు.

## రెవెన్యూ సదస్సులు పారదర్శకంగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

జైనథ్, మే 5 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సు పార దర్శకంగా చేపట్టాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం భోరజ్ మండలంలోని కోరటలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భోరజ్ మండలంలో ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ శ్యామలాదేవి, భోరజ్ తహసీల్దార్ రాజేశ్వరి, ఇతర రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కోరటలో భూ భారతి రెవెన్యూ సదస్సు రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## కూలీలకు పనులు కల్పించాలి

ఖానాపూర్ రూరల్, మే 5 : ప్రతి గ్రామంలో 18 ఏండ్లు నిండిన యువకులకు ఉపాధి కూలీల పనులు కల్పించాలని ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు అన్నారు. ఖానాపూర్ మండలంలోని అడవి సారంగాపూర్‌లో సోమవారం దిలావర్‌పూర్, గోడల పంపు గ్రామాలకు చెందిన ఉపాధి కూలీల పనులు పర్యవేక్షించారు. ప్రతి గ్రామంలో 150 మంది కూలీలకు పైగా పనులను కల్పిస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కార్యదర్శి దివ్య, ఎస్‌పి శ్రీనివాస్‌కు సూచించారు.

## జీటీవీ రియల్ హీరోస్‌లో సీఐకి అవార్డు

భైంసా, మే, 5 : ప్రముఖ ఛానల్ జీ టీవీ నిర్వహించిన తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ – 2025లో భైంసా పట్టణ సీఐ గోపినాథ్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శాంతి పరిరక్షణ కమ్యూనిటీ పోలీసింగ్, తదితర కార్యక్రమాల అమలులో భాగంగా ఆయనకు ఈ పురస్కారం లభించిందన్నారు.



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పట్టణ సీఐ గోపినాథ్

## రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

బోథ్, మే 5 : కేసుల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం బోథ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్రైం వివరాలు అడిగి తెలుసుకొని, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో వాహనాలు, వాటి స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సిబ్బంది క్రమ శిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజలతో మమేకమై సత్సంబంధాలు మెరుగు పర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోథ్ సీఐ వెంకటేశ్వర రావ్, ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## జీతాలు ఇప్పించాలని ఐటీడీఏ ఎదుట నిరసన

ఉట్నూర్, మే 5 : విద్యాంజలిలో ఉద్యోగాలు చేస్తున్న సిబ్బందికి జీతాలు ఇప్పించాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలో అనంత సొల్యూషన్, విద్యాంజలి 2.0 ద్వారా గిరిజన ఆశ్రమ పాఠశాలలో, సంక్షేమ హాస్టల్, ఆఫీస్ సబార్డినేటర్, వాచ్‌మెన్, అటెండర్, స్వీపర్, ఇంగ్లిష్ టీచర్, కంప్యూటర్ ఆపరేటర్ ఇతర పనులు నిమిత్తం 40 మందిని రిక్రూట్ చేశారన్నారు. కాని 9 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో ఆ వర్కర్లు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కావున ఐటీడీఏ పీవో స్పందించి వారికి వేతనాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు స్వాతి, నరేశ్, స్వరూప, సాయిరాణి, సువర్ణ, రాజేశ్వరి, ప్రశాంతి, రాజమౌళి, రమ్య, సంజు, యాదవ్‌రావు, సుజాత, సునీత పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ ఆధ్యాపకుడికి డాక్టరేట్

బాసర, మే 5 : బాసర ఆర్జీయూకేటీ ఆధ్యాపకుడు చింతం శ్రావణ్ డాక్టరేట్ పొందడంపై వీసీ గోవర్ధన్ సోమవారం అభినందించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నుంచి పర్ఫామెన్స్ అప్టిమేషన్ ఆఫ్ జీసీ ఈడ్రామ్ మిమోరి కంట్రోలర్ ఫర్ మల్టీ ప్రాఫెసర్ సోసీ అనే అంశంపై చేసిన పరిశోధనలకు ఈ డాక్టరేట్ పొందినట్లు తెలిపారు.



ఆధ్యాపకున్ని అభినందిస్తున్న వీసీ గోవర్ధన్

## క్రీడాకారులకు అల్పాహారం అందజేత

ఖానాపూర్, మే 5: ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఉచిత శిక్షణ పొందుతున్న వంద మంది క్రీడాకారులకు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజురా సత్యం సోమవారం అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, క్రీడకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాకత్‌పాషా, కోచ్‌లు శేక్ ఇర్ఫాన్, రిజ్వాన్, రాము, ఆరిఫ్‌ఖాన్, ఇమ్రాన్ తదితరులున్నారు.

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ, మే 5 : మండలంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం మండలంలోని మాదాపూర్, పట్వారిగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఇక్కడ పశు వైద్య సిబ్బంది చంద్రశేఖర్, దేవరావు, రైతులు పాల్గొన్నారు.

## తరుగు లేకుండా ధాన్యం కొనాలి

భైంసా, మే, 5 : తరుగు తీయకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరుగాలం వ్యయప్రయాసలకోర్చి పండించిన పంటలను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే తరుగు పేరిట రైతులను నిర్వాహకులు నిండా ముంచుతున్నారన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంతేగాకుండా రైతులకు అన్యాయం చేయకుండా కొనుగోలు చేపట్టాలన్నారు. 40 కేజీల బస్తాకు 2 కేజీలు తరుగు తీయడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఇలాంటివి జరగకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని పేర్కొన్నారు.

## జొన్న చిగురు తిని మూడు లేగదూడలు మృతి

దిలావర్‌పూర్, మే 5 : మండలంలోని మాడెగాం గ్రామ రైతు పులిండ్ల విజయ్‌కి చెందిన మూడు లేగదూడలు సోమవారం జొన్న చిగురు (జొన్న లేప) తిని మృతి చెందినట్లు రైతులు తెలిపారు. రోజు మాదిరిగానే మేతకు వెళ్లి వచ్చిన మూడు దూడలకు నురుగులు రావడాన్ని గమనించిన రైతు పశువైద్యాధికారికి సమాచారం అందించారు. డాక్టర్ విజయ్‌కుమార్ వాటికి వైద్యం అందించినా మృతి చెందాయి. వాటి విలువ దాదాపు రూ.90 వేల వరకు ఉంటుందని రైతు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. విషయం తెలుసున్న స్థానిక నాయకులు బాధిత రైతును పరామర్శించారు.

## అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు

దిలావర్‌పూర్, మే 5 : దిలావర్‌పూర్ మండల పరిధిలోని గ్రామాల్లోని వాగుల నుంచి శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌లో నుంచి మట్టిని, మొరంను అనుమతి లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఏజాజ్ హైమద్ తెలిపారు. తమ పరిధిలోని ఏ విధమైన వాహనాలకు ఇసుక, మొరం, గోదావరి మట్టిని తరలించేందుకు ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ నుంచి మట్టిని తీసుక వెళ్లిన వాహనాలు దిలావర్‌పూర్ ఎస్ఐ సందీప్ సహకారంతో పట్టుకొని మైనింగ్ శాఖకు అప్పగించామని తెలిపారు.

## పండ్ల తోటల పెంపకంతో లాభాలు

దస్తురాబాద్, మే 5 : పండ్ల తోటల పెంపకంతో రైతులు లాభాలు పొందవచ్చని డీఆర్డీఏ ఏపీడీ నాగవర్ధన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం పనులు, తాగునీటి సమస్యలపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్, ఏపీవో రవి ప్రసాద్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఎరువులు అధికంగా వాడితే అనర్థం

తాంసి, మే 5 : రసాయన ఎరువులు అధికంగా వాడితే అనర్థమేనని జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ స్వామి అన్నారు. సోమవారం మండలంలోని పొన్నారి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రసాయన ఎరువులు అధికంగా వాడితే దిగుబడి తగ్గి పెట్టుబడులు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ వై ప్రవీణ్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కే రాజశేఖర్, డాక్టర్ జీ మోహన్ దాస్, డాక్టర్ పోషాద్రి, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ జీ శివచరణ్, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేందర్ రెడ్డి, డాక్టర్ ప్రవీన్, తాంసి డివిజన్ ఏడీఏ రవీందర్, మాజీ సర్పంచ్ అండె అశోక్, నాయకులు లింగా రెడ్డి, మల్లయ్య, ఆనంద్, రఘు, అనిల్ కుమార్, సాయినాథ్, రమణ, లక్ష్మీపతి రైతులు పాల్గొన్నారు.

## చదువుల్లో ఉన్నతంగా రాణించాలి

ఎదులాపురం, మే 5 : చదువుల్లో ఉన్నతంగా రాణించాలని డీఐఈవో గణేశ్ జాదవ్ అన్నారు. కలెక్టర్ సూచనల మేరకు సోమవారం డీఐఈవో గణేశ్ జాదవ్ సన్ రైజ్ హబ్‌లో స్నేహకు అడ్మిషన్ ఇప్పించారు. ఈ సందర్భంగా డీఐఈవో గణేశ్ జాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన స్నేహను ఇటీవల రెవెన్యూ గార్డెన్‌లో కలెక్టర్ సత్కరించారన్నారు. అయితే ఉన్నత చదువుల కోసం సహకారం అందించాలని విద్యార్థి కోరడంతో మంచి ఇనిస్టిట్యూట్‌ను చూడాలని కలెక్టర్ సూచించారన్నారు. సన్ రైజ్‌లో కోచింగ్ తీసుకుంటానని విద్యార్థి చెప్పడంతో పూర్తిగా విచారించిన తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు అమ్మాయికి అడ్మిషన్ ఇప్పించారన్నారు. ఉన్నతంగా రాణించాలని ఈ సందర్భంగా డీఐఈవో అకాంక్షించారు.

## ఆటల్లోనూ ప్రతిభ చూపాలి

ఇంద్రవెల్లి, మే 5 : గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులు చదువులతోపాటు ఆటల్లోనూ ప్రతిభ చూపాలని ఉట్నూర్ సీఐ మొగలి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ శిక్షణ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగలి పాల్గొని విద్యార్థులతో కలిసి ఆటలపోటీలను ప్రారంభించారు. ఉట్నూర్ డివిజన్‌లోని ప్రతి మండలంలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని సీఐ తెలి పారు. ఇక్కడ ఎస్ఐ సాయన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## పట్టా పాసు పుస్తకం అందించాలి

నర్సాపూర్ (జీ), మే 5 : మండల కేంద్రంలోని సర్వే నంబర్ 667ఈలో ఐదెకరాల భూమికి పట్టాపాసు బుక్ అందించాలని గౌడ సంఘం నాయకులు ముష్కం సుదర్శన్ గౌడ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్‌కు ఐదెకరాల భూమికి పట్టా పాస్ పుస్తకం అందించాలని లిఖిత పూర్వకంగా దరఖాస్తు అందించినట్లు ఆయన తెలిపారు.

## నిర్మల్‌లో వర్షం

నిర్మల్ చైన్‌గేట్, మే 5: నిర్మల్ పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురియడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మూడు రోజుల నుంచి ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వర్షం కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రైతులు వరి ధాన్యాన్ని రక్షించుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.

## రైతు ధర్నాను జయప్రదం చేయండి

ఖానాపూర్ రూరల్, మే 5 : ఈనెల 8న హైదరాబాద్‌లో జరిగే రైతు ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకుడు మాడావి అంకుశ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మండలంలోని అడవిసారంగాపూర్ గ్రామపంచాయతీ పరిధి జిల్లెడుకుంటలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గోడ ప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గెడెం చందు, పెందూర్, మోహన్ శంకర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.